# వ్యాస కౌముది



## అంగర వేంకట కృష్ణారావుగారు

**- మల్లాప్రగడ రామారావు**

ఇది విస్మృత మహారచయిత అంగర వేంకట కృష్ణారావు గారి శతజయంతి సంవత్సరం.

కృష్ణారావు "విశాఖ సాహితి" వ్యవస్థాపక అధ్యక్షులు. నన్ను కార్యదర్శిని చేసారు. ఇది "విశాఖ సాహితి" స్వర్ణోత్సవ సంవత్సరం కూడా.

"బెంగాలీలో భబానీ భట్టాచార్య, బిభూతి భూషణ బందోపాధ్యాయ, మానిక్ బందోపాధ్యాయ, మలయాళం లో తకళి శివశంకర్ పిళ్లై, తమిళంలో ఆర్.కె. నారాయణ్, కానా శివసుబ్రహ్మణ్యం వంటి రచయితలు కోవలో చేరుతారు– తెలుగులో చాసో, కె.కె., రా.వి. శాస్త్రి, అంగర వెంకట కృష్ణారావు, కాళీపట్నం రామారావులు"

ఈ మాటలు అన్నది ప్రముఖ రచయిత, విమర్శకులు, సంపాదకులు శ్రీ పురాణం సుబ్రహ్మణ్యశర్మ గారు.

కృష్ణారావు గారు 1920వ సంవత్సరం సెప్టెంబర్ 20 న విశాఖపట్టణం లో వారి మేనమామ, ప్రముఖ చారిత్రక నవలా రచయిత మొసలికంటి సంజీవరావు గారి ఇంట జన్మించారు. విశాఖపట్టణంలోనే తమ 54వ ఏట, 1974 వ సంవత్సరం డిసెంబరు 29న న కేన్సర్ వ్యాధితో ప్రభుత్వ ఆసుపత్రిలో (కింగ్ జార్జి హాస్పిటల్) మరణించారు.

వారి పాఠశాల విద్య విశాఖపట్టణంలోనూ, విజయనగరంలోనూ సాగింది. ఓడలు బళ్ళైన దిగువ మధ్యతరగతి కుటుంబం కావడాన ఉన్నతవిద్యలు చదవలేకపోయారు. విజయనగరం దరి చిట్టివలస జనపనార మిల్లులో

చిరుద్యోగిగా చేరారు. రెండవ ప్రపంచయుద్ధం మన దేశానికీ విస్తరించడంతో సైన్యం లో హవల్దారుగా భర్తీ అయ్యారు. వారే "విరామం" కథకుడి మాటలలో చెప్పినట్టుగా "ముఖ్యంగా డబ్బు కోసం, తరువాత దేశం నాలుగు మూల్లా చూడొచ్చని. కొంతకాలం సాహస జీవితం గడపొచ్చనికూడా". బర్మా సెక్టార్ లో తూర్పు బెంగాల్ ప్రాంతాలలో పనిచేసి 1948లో సైన్యం సేవ నుండి విరమించుకున్నాక, బ్రూక్ బాండ్ కంపెనీ యొక్క విశాఖపట్టణం శాఖాకార్యాలయంలో మరణపర్యంతం ఉద్యోగం చేసారు.

కృష్ణారావు గారు 1948-70 కాలంలో దాదాపు మూడు వందల కథలు వ్రాసారు. అవి నాటి ప్రసిద్ధ పత్రికలు "భారతి", "తెలుగు స్వతంత్ర" "ఆనందవాణి", "జ్యోతి' లలోనూ, తరవాత బ్రతికిన నాలుగేళ్లలో అరుదుగా వ్రాసిన కొద్ది కథలూ "ఆంధ్రప్రభ", "ఆంధ్రజ్యోతి" వారపత్రికలలోనూ అచ్చయ్యాయి. ఒక కథ ఆంగ్లంలోకీ అనువాదమైంది.

వారు 5 నవలలు- "ఊసరవెల్లులు", "భావికాలం", "జ్వాలాసుందరి", "విరామం", "సీతకథ" వ్రాసారు.

"సీతకథ" "ఆంధ్రప్రభ" వారపత్రిక లో ధారావాహికగావచ్చింది. తరువాత "ఎమెస్కో వారు పుస్తకంగా ప్రచురించారు.

"విరామం" మొదట "ఆంధ్రజ్యోతి" వారపత్రికలో 1967-68 సంవత్సరాలలో ధారావాహికంగా ప్రచురితమైంది. 1970లో విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ వారు పుస్తకరూపంలో ప్రచురించారు. తదనంతరం జ్యేష్ఠ లిటరరీ ట్రస్ట్ వారు 2008 లో పునర్ముద్రించారు. డా. శారద గారు కన్నడంలో అనువదించిన "విరామం" ను ద్రవిడ విశ్వవిద్యాలయం వారు ప్రచురించారు.

కృష్ణారావు గారు నిరాడంబరులు.

నిగర్వులు. అల్పసంతోషి. వారి రెండవ అమ్మాయి చంపగారు చెప్పినట్లు "జ్ఞానమేకాని గడుసుదనం లేనివారు." దిగువ మధ్యతరగతి బ్రతుకులోనే, కష్టంలో వున్న బంధువులను ఆదుకునేవారు.

ప్రకృతి ప్రేమికులు కృష్ణారావు గారు తమ నలుగురు కుమార్తెలకు పువ్వుల పేర్లేపెట్టారు.

సంస్కృత మన్నా, సంగీతమన్నా ప్రాణం. రేడియోలో ఉదయం 8 గంటలకు ప్రసారమయ్యే సైగల్ పాటలు, రాత్రి ప్రసారమయ్యే కర్ణాటక సంగీత కార్యక్రమాలు రోజూ వినేవారు. సంస్కృతం నేర్చుకునేందుకు తెల్లవారుఝామునే లేచి స్నానాదికాలు పూర్తి చేసుకుని పాత విశాఖలోని జగన్నాథస్వామి వారి ఆలయానికి వెళ్ళేవారు.

కీర్తి ప్రతిష్టల తలపేలేదుక్రృష్ణారావుగారికి. తమ రచనలను భద్రపరిచే ప్రయత్నం ఎన్న డూ చెయ్యలేదు. వారి మరణానంతరం వారి కథలు పుస్తకంగా తీసుకురావాలనుకున్న "విశాఖ సాహితి" కి కొన్ని కథలే లభ్యమైనాయి. వాటితోటే "కదిలే బొమ్మలు" కథాసంకలనం "విశాఖ సాహితి" 1975 లో ప్రచురించింది.

1970లో "విరామం" నవలకు అక్కినేని నాగేశ్వరరావు లిటరరీ అవార్డ్ ప్రకటించి, అందించకపోయినా ఆ విషయమే ఆయన పట్టించుకోలేదు – తర్వాత నాలుగేళ్ళు బ్రతికున్నా. కౌలాలంపూర్ లో జరిగిన మొదటి ప్రపంచ తెలుగు మహాసభలకు, విశాఖపట్టణం రచయితలలోకెల్లా, కృష్ణారావుగారికొక్కరికే ఆహ్వానం వచ్చింది. అందుకు గర్వించనూలేదు. వెళ్ళలేక పోయినందుకు విచారించనూలేదు.

రచయిత స్వేచ్ఛాకంకణధారి

సైన్యంలో సేవ తరువాత క్రృష్ణారావుగారి జీవితంలో ముఖ్యఘట్టం "విశాఖ సాహితి" స్థాపన.

అప్పటికింకా "విప్లవ రచయితల సంఘం" ఏర్పడలేదు. ప్రత్యామ్నాయం సూచించక పోయినా, వ్యవస్థను తీవ్రంగా ధిక్కరించిన దిగంబర కవుల కవితా సంకలనాలో మూడోది విశాఖపట్నం లో వున్న లక్ష్మీ టాకీస్ సమీపాన ఒక పడుపుగత్తె ఆవిష్కరించారు.

ఆ తర్వాత మహాకవి శ్రీశ్రీ షష్టి పూర్తి సభ విశాఖపట్నం పురపాలక సంఘ మైదానంలో జరిగింది. విశాఖపట్నం లోనే వున్న

ఆంధ్ర విశ్వవిద్యాలయ విద్యార్థులు శ్రీ శ్రీ గారి కి కొన్ని ప్రశ్నలు సంధిస్తూ ఒక కరపత్రం విడుదల చేశారు. నక్సల్బరీ ఉద్యమం శ్రీకాకుళ సాయుధపోరాటంగా విస్తరించింది. ప్రాణిగ్రాహి గారి లాంటి కవులు సవ్యసాచులై ఆ పోరాటానికి నాయకత్వం వహించారు.

ఈ పరిణామాల ఫలితమే రచయితలంతా వర్గపోరాట సిద్ధాంతానికి బద్ధులై వుండాలన్న సూత్రీకరణ.

ఈ నేపథ్యంలో

"వి.ర.సం." అంటే "విశాఖ రచయితల సంఘం" అనుకునేరు సుమా" అన్న ముక్తాయింపుతో "జ్వాల" వారపత్రికలో ఎవరో ఆ సంస్థ ను ఎద్దేవా చేస్తూ ఓ వ్యంగాస్త్రం సంధించారు.

ఆ రోజుల్లోనే విశాఖ రచయితల సంఘం "సాహిత్యం ఎందుకు?" అనే అంశంపై

ప్రసంగ వ్యాసాలు వ్రాసి సభ్యులను చదవమన్నారు. ఆ కసరత్తు వల్ల తేలిందేమంటే సాయుధ పోరాటానికి కలంసాయం చేసే నిబద్ధత గల రచయితలకే ఆ సంస్థలో చోటుందని, ఇతరులు కొనసాగదలిస్తే దూషణలు, హేళనలూ తప్పవనీ.

పొమ్మనే పొగపెట్టడంతో, అంగర వెంకట కృష్ణారావు గారికి భావప్రకటనా స్వేచ్ఛ మౌలిక ప్రాతిప్రదిక గా గల మరో వేదిక విశాఖ రచయితలకు ఆవశ్యకమని తోచి అందుకు పూనుకున్నారు. తన భావాలతో ఏకీభవించే, అప్పటికే లబ్ధప్రతిష్ఠులైన సహరచయితలు, నాలాంటి కొందరు యువరచయితలతో, వారు ఉద్యోగిగా వున్న బ్రూక్ బాండ్ ఆఫ్ ఇండియా కార్యాలయం లో నే వ్యవస్థాపక సమావేశం తేదీ 4-4-1971 న నిర్వహించారు.

ఇలా చేయాల్సి రావడం, తమ అబనుంగుమిత్రులు, ప్రముఖ రచయితలు అంగర సూర్యారావు గారు, పురిపండా అప్పలస్వామి గారు వంటి కొందరికి దూరం కావాల్సిరావడం కృష్ణారావుగారికి చాలా బాధ కలిగించివుంటుంది. ఐనా, అతి తరచుగా వారింటికి వెళ్ళే మాతో ఎన్నడూ ఆ ఊసెత్తలేదు. వారికి ముందు చూపే గాని, వెనకచూపులేదు. భావప్రకటనాస్వేచ్ఛ రచయితలు వదులుకోలేని హక్కని క్రృష్ణారావుగారి భావన. అందుకనే వ్యక్తిగత స్నేహాలకంటే, ఆదర్శానికే ప్రాధాన్యమిచ్చారు. వారికి వెన్ను దన్నుగా నిలిచారు విఖ్యాత సాహితీవేత్తలు గణపతి రాజు అచ్యుతరామరాజు గారు, ఘండికోట బ్రహ్మాజీ రావు గారు.

శ్రీయుతులు ద్విభాష్యం రాజేశ్వరరావు, ఎస్. కాశీవిశ్వనాథం,, ఆదూరి వెంకట సీతారామమూర్తి, నవులూరి వెంకటేశ్వరరావు, శివల

జగన్నాధరావు, వెల్చేరు చంద్రశేఖర్, ఉన్నవ వెంకట హరగోపాల్ (మానస), అంగర వెంకట శివప్రసాదరావు, "శ్రీవ్రాజు", బాలి, రాణీ మోహనరావు, ఇందూ రమణ, సుస్మితా రమణమూర్తి, గాదె రంగనాయకమ్మ,

బి.వి. ఎస్. భానుశ్రీ, ఎల్. ఆర్. స్వామి, మొదలైన వారమెందరమో రచయితలగా రూపొందడానికి లేదా ఎదగడానికి "విశాఖసాహితి" దోహదకారి అయ్యింది. అందులో గణనీయమైన పాత్ర కృష్ణారావు గారిదే.

మేమే కాదు తొలినాళ్లలో విశిష్ట రచయిత, విలక్షణ నటుడు గొల్లపూడి మారుతీరావు గారిని తీర్చిదిద్దినది కృష్ణారావు గారే. వారి "ఎందుకు వ్రాస్తున్నాను" కథలో బూరెబుగ్గల బాల కథకుడు గొల్లపూడి వారే. ఎం. రామకోటి గారు కూడా వారి కథలు వినిపించి క్రృష్ణారావు గారి సలహాలు స్వీకరించేవారని వారి అమ్మాయి శ్రీమతి రమణి గారు గుర్తుచేసుకున్నారు.

సానుకూలతే వారి జీవన దృక్పథం.

"విశాఖ సాహితి" స్థాపన వార్తలు దినపత్రిక లలో చూసిన సంబరం కాస్తా, "మఖలో పుట్టి పుబ్బలో మాడిపోయే సంస్థలకు ప్రచారాలెందు"కంటూ, అందుకు నిరసనగా మా ఉపాధ్యక్షులు, కీ.శే. ఎమ్. రామకోటి గారు రాజీనామా లేఖ మా ఇంటి చిరునామాకి పంపగా, ఆ ఉత్తరం పట్టుకుని విలవిలలాడుతూ మేం ముగ్గురం (నేను, శ్రీ అంగర వేంకట శివప్రసాద్, శ్రీ వై.వి.ఎస్. నూకరాజు "శిర్రాజు") కృష్ణారావు గారింటికి పరిగెత్తాం. ఆ ఉత్తరం నిమ్మళంగా చదివి, చిరునవ్వుతో కృష్ణారావు గారన్న మాటలు "మంచిదే. మఖ నుంచి పుబ్బ వరకూ నడుస్తుంది కదా! " ఇవి నాకు మార్గదర్శకంగా నిలిచాయి. తర్వాత జీవితంలో సాహిత్య, సాహిత్యేతర రంగాలలో ఏ సంస్థ నెలకొల్పినా అదెన్నాళ్ళు ఉంటుందన్న చింత నాకు లేకుండా పోయింది. ఉన్నన్నాళ్ళూ బాగా పనిచేస్తే చాలన్న దృక్పథం ఏర్పడింది

క్లుప్తత, ఆప్తత వారి రచనా లక్షణాలు. "కొండ అద్దమందు కొంచమై వుండే" చందం వారిది. చిన్న చిన్న వాక్యాలు భావగర్భితాలు. గుండెల్ని పిండేసే సంఘటనలూ ఒకటి, రెండు పేరాలే.

కథల విషయమే కాదు, నవలల విషయం లోనూ అంతే. వారి విఖ్యాత నవల "విరామం" అచ్చులో 100 పేజీలోపే. అందుకే వారి రచనలు ఒళ్ళు దగ్గర పెట్టుకొని చదవాలి.

కళ్ళు మిరుమిట్లు గొలిపే ఉపమానాలు కూడా క్రృష్ణారావు గారి స్వంతమే.

వారి రచనలలో తలమానికం "విరామం". దానికదేసాటి. నామాట కాదు.

మేథావి, ప్రఖ్యాత పత్రికా సంపాదకులు నార్ల వెంకటేశ్వరరావు గారు " యుద్ధం నేపథ్యంలో తెలుగులో వచ్చిన నవలలో కెల్లా "విరామం" ఉత్తమమైన, సాధికారకమైన ఒకేఒక్క నవల"' అని కితాబు ఇచ్చారు, "నేషనల్ బుక్ ట్రస్ట్" వారి "బుక్స్ ఇండియా" పుస్తక సమీక్ష లో.

పురాణం సుబ్రహ్మణ్యశర్మ గారు "విరామం" పుస్తకానికి వ్రాసిన "ఒక చిన్న మాట" లో భబానీ భట్టాచార్య బెంగాల్ క్షామం గురించి వ్రాసిన "సోమెనీ హంగర్స్" తో తులతూగగల, యుద్ధఫలితాల నభివ్యక్తంచేసే మొట్టమొదటి నవల తెలుగు లో "విరామం" అంటే ఎవరూ ఆశ్చర్యపోనక్కరలేదు" అన్నారు. వారే, చివరగా "ఇతివృత్తం, భాష, శైలి, శిల్పం, పాత్రపోషణతో సహా అన్నింట్లోనూ "విరామం" భారతీయ భాషలలో వచ్చే ఏ ఉత్తమ నవలకూ తీసిపోదని" నిర్ధారించారు.

ఘండికోట బ్రహ్మాజీ రావు గారు ఆశించినట్టు "నేషనల్ బుక్ ట్రస్ట్" వారి ఆదానప్రదాన కార్యక్రమాలలో ఈ నవలను కూడా చేర్చి, భారతదేశపు భాషలన్నిటిలోకీ దీనిని అనువదించేసి ప్రచారంలోకి తెచ్చే గొప్ప సత్కార్యం" జరగలేదు.

"విరామం" నవల "ఆంధ్రజ్యోతి" వారపత్రిక లో ధారావాహికగా రావడానికి కారణభూతులు, ఆ నవల పునర్ముద్రణకు పూనుకున్న మరో ప్రముఖ కథకులు, "భరాగో" గా ప్రసిద్ధులైన భమిడిపాటి రామగోపాలంగారి "ఈ నవలను ఆచరించవలసినదని, బి.ఏ., ఎం.ఏ., తరగతులకు పాఠ్యగ్రంథంగా ఈ పుస్తకాన్ని నిర్ణయించడం వారికి కర్తవ్యమ"ని విద్యావేత్తలకు, విశ్వవిద్యాలయాలకు చేసుకున్న మనవి ఏ కులపతులకూ పట్టలేదు. కృష్ణారావు గారి రచనలపైన ఏ విశ్వవిద్యాలయం లోనూ పరిశోధనలైనా జరగిన దాఖలా లేదు.

కనీసం "విరామం" కు ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ పురస్కారం కూడా దక్కలేదు.

"తిలాపాపం తలా పిడికెడు". వారి ఉత్సాహప్రోత్సాలు పొంది, "విశాఖ సాహితి"లో వారి వెన్నంటి వున్న మేమెవరమూ ఈ దిశగా కృషి చెయ్యలేదు.

ఒక ఊరట ఏమంటే, "విశాఖ సాహితి" స్వర్ణోత్సవ సంవత్సరంలో, అంగర వేంకట కృష్ణారావు గారి శతజయంతి పురస్కారంగా, "వి.సా." సభ్యులు, సాహిత్యాభిమానుల ఆర్థిక సహకారంతో లక్ష రూపాయల నగదుతో ప్రముఖ రచయిత శివారు జగన్నాథరావు గారిని సత్కరించగలిగాము. ఇందుకు నాకు అండగా నిలిచినది "వి.సా." వర్తమాన కార్యదర్శి ఘండికోట విశ్వనాథంగారు.

2021 సెప్టెంబర్ తో ముగిసే అంగర వేంకట కృష్ణారావు గారి శతజయంతి సంవత్సరం లోగా, పైవన్నీ గాని, కొన్నైనాగాని జరిగితే, గతంలో ప్రకటించిన అక్కినేని నాగేశ్వరరావు లిటరరీ అవార్డ్ వారి కుటుంబ సభ్యులకు ప్రసాదించగలిగితే, సమంజసంగా ఉంటుంది.

మల్లాప్రగడ రామారావు
వ్యవస్థాపక కార్యదర్శి, విశాఖసాహితి

***